# ప్రేమంటే...

శాఖా శ్రీనివాసరావు

సమయం సాయంత్రం ఆరూముప్పయి దాటుతోంది.

సంధ్యా సమయం ముగుస్తుండగా ముసురు కుంటున్న చీకటిని విద్యుద్దీపాల మేలిమి కాంతి జయించి తనకంటూ అక్కడో చిన్న సామ్రాజ్యాన్నేర్పరుచుకుంది!

ఒంటరిగా కూర్చున్న 'లలిత' మరికొన్ని గంటలలో తనకు జరగ బోయే 'తంతు'కు సంబంధించిన ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి కాసాగింది.

"....ఈ రోజు తనకు శోభనం. కానీ అందుకు అందరి స్త్రీలలా మనసు లోతుల్లో ఆనందం కాక వ్యక్తం కాని వేదవేదో కుమ్మరి పురుగులా తొలిచేస్తోంది. బహుశా కొద్ది గంటల్లో అర్పితం కాబోతున్న తన స్త్రీత్వం తనకు మానసికంగా ఎంతో దగ్గరైన తన ప్రియునికి గాక పెద్దల సమక్షంలో కేవలం పెళ్లి చూపుల పరిచయంతో అగ్నిసాక్షిగా తాళి కట్టిన మరో వ్యక్తికి అంకితం కాబోతుండడంతో పరిపరి విధాల పరుగెడుతున్న ఆలోచనలు సిగ్గుతో కూడిన వ్యధను అధికంగా గుర్తు చేస్తుండడంతో కలుగు తున్న ఫీలింగేమో.. అది.. కానీ..."

ఆమె ఆలోచనలను చెదర గొడుతూ 'ఇదిగో ఆంటీ.. ఎవరో సంజయ్ అంకుల్‌ట. ఈ కవరు నీకివ్వమని చెప్పారు..'' అంటూ ఆమె చేతికో కవరందించి 'ఫైవ్‌స్టార్' చప్ప రించు కుంటూ వెళ్లిపోయాడు అజయ్.

'సంజయ్' అన్న పదం వినిపించ గానే ఆమె గుండె ఒక్కసారిగా 'లయ' తప్పింది చుట్టూ ఓ మారు పరికించి నెమ్మదిగా గది తలుపులకు గడియ వేసుకుంది. 'లబ్‌డబ్' మంటూ ఆమె గుండె చేస్తున్న చప్పుడు ఆ గదిలోని నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఆమెకు మరింత అలజడిని కలిగిస్తుండగా వణుకు తున్న వేళ్లతో కవరును ఓపెన్ చేసింది. ఆసక్తితో కూడిన అయిష్టంతో!

వైట్‌పేపరు నీట్‌గా వ్రాయబడుతున్న సుపరిచిత అక్షరాలపై ఆమె చూపు ఓ క్షణం నిలించి ఆపై లైన్ల వెంబడి నెమ్మదిగా పయ నించసాగింది.

*******

ప్రియ లలితా...

'ప్రే' రేపణలకు పరిమితి అనేది లేకుండా పెరిగిన 'మ'మకారం మనసు నిండా నిండిపోవడమే 'ప్రేమ' అని నా అభిప్రాయం!

నాలుగు సంవత్సరాలుగా ఎన్నో బాసలు చేసుకుంటూ మరెన్నో కొరికల గుర్రాలపై విహరిస్తూ అంతకుమించిన ఆశల సౌధాలను నిర్మించుకుంటూ ఒక లిమిట్ అంటూ లేని లెటర్లు వేలకొద్ది వ్రాసుకుంటూ పెంచు కున్న మన ప్రేమను నాలుగురోజుల్లో శాశ్వ తంగా మనోఫలకం నుంచి చెరిపేయ గలి గావా డియర్! నో-నేన్నమ్మను!

ఏకాంత ప్రదేశాలలో అప్పుడపుడు నా ఎదపై నీ మేను వాల్చుకుని ఊహాలోకాల లో విహ రిస్తూ నీవు- 'ప్రదోష' కు ముందు తన తలపై నుండి ఎగురుతూ కొద్దిక్షణాలలో విరహ వేదన అనుభవించబోయే మన ఇరువు రిపి రకరకాల శబ్దాలతో వెక్కిరిస్తూ... చీకటి తెరలు కమ్ముకొస్తుంటే గూళ్ల కెళ్లడమే పర మావధిగా పయనించే అనేక పక్షి గణాలను నీ ముని వేలుతో నీకు సుతారంగా చూపుతూ 'మనం ఇంకా ఒక గూటి పక్షులం కాలే దనేగా వాటి కాగర్వం'' అంటూ నీవు బుంగ మూతి పెట్టడం వంటి అనేక సంఘటనలు ఇంకానా హృదిలో మెదులు తూనే ఉన్నాయ్!

అఫ్‌కోర్స్-అవిప్పుడే నను వీడి (నీలా) పోవనుకో!

మన ప్రేమను మీ పెద్దలు అంగీకరించ డంలేదన్నమిషతో మనసు మార్చుకున్నానని చెప్పడం ద్వారా నన్ను నమ్మించడానికి ప్రయ త్నించావు కదూ..?

నీ ఎదపై చేయుంచుకుని అసలు నిజం ఒప్పుకోగలవా ప్రియా..?

నీవు దూరమౌతున్నందుకు ఆ క్షణం నుంచే నేను నిజంగానే వ్యథ చెందు తున్నాను ఇందుకు సంఘంలో మీ పలుకుబడికి తగిన గొప్ప హోదా గల వ్యక్తిని నీకు పెళ్లి చేయ నిశ్చ యించడం ద్వారా మీ పెద్దలు నీ మనసు మార్చడానికి చేసిన ప్రయత్నాన్ని నేను తప్పు పట్టడం లేదు. అందుకు ఆకర్షించబడిన నా వ్యక్తిత్వాన్ని ఇంతటి పరిచయం లోనూ ఎందుకు అంచనా వేయలేక పోయూనా అని మథన పడుతున్నాను!

ప్రియలలితా...

ఏ మనిషీ నిరుద్యోగిగా ఐమీన్ ఉపాధి లేని వ్యక్తిగా ఎల్లకాలమూ వుండ జాలడు. అయితే తాత్కాలిక సమస్యలకు బెదిరి పోయి మన ప్రేమను బలి పెడతావని నేనూహించ లేదు. మన మధ్య ప్రేమానుబంధం శాశ్వ తం కావడానికి కేవలమూ నా నిరుద్యోగమే అడ్డు అని నీవు భావిస్తున్నావని తెలిస్తే రిక్షా అయినా తొక్కడానికి నేను సిద్ధ పడేవాడినే!

కానీ పరువుగల కుటుంబంలో అల్లారు ముద్దుగా పెరిగిన నిన్ను (నా సంగతొది లేయ్.. ఎందుకంటే మన ప్రేమ కోసం నన్ను పది మంది నీచంగా చూసే వృత్తినైనా సరే చేపట్టడానికి నేనుసిద్ధమే గనుక!) అంత గౌరవంగానూ ఆనందంగానూ భావి జీవితం లో కూడా పోషించాలనే తపన తోనే ఇంత కాలమూ చిన్న చిన్న ఉద్యోగాలను త్రోసి పుచ్చాను. ఎందుకంటే నీతో సంసారాన్ని ప్రారంభించాక నా జీవితపు చివరి అంకం పూర్తయ్యే లోపు ఎపుడైనా నువ్వు నన్ను కట్టు కున్నందుకు మన ఆర్థిక స్థితిపై విసుగును ప్రదర్శిస్తే ఈ దేశపు సగటు మధ్య తరగతి భర్తలా చిర్నవ్వుతో తట్టుకునే గొప్ప వ్యక్తిత్వం నాకు లేదు గనుక!

నా ఆలోచనలకు నీలో నవ్వు జనిస్తోంది కదూ?

సరిగ్గా ఆరు వారాల క్రితం ఉద్యోగ విషయమై బెంగుళూరు వెళ్లిన నేను అక్కడ అను కోని విధంగా ఉద్యోగం ఖాయం కావ డంతో కలిగిన ఆనందాన్ని నీతో పంచు కుందామని రెక్కలు కట్టుకుని వాలిన నాకు ఆ మరునాడే నీకు నిశ్చయ తాంబూలాలు పుచ్చుకోబోతున్నారని తెలిసి అందుకు నీవెలా సమ్మతించావో అర్థం కాక అసలు విషయం తెలుసు కోవడానికై అతి ప్రయాస మీదనిన్ను ఆ సాయంత్రం ఒంటరిగా కలుసు కోగలి గాను. అయితే-

నా ఉద్యోగ విషయం తెలియని నీవు చాలా కాజువల్‌గా బాధ పడుతూ 'మన ప్రేమను ఎట్టి స్థితిలోనూ మా వాళ్లు ఒప్పు కునేలా లేరు. వాళ్ల నెదిరించి మనం పెళ్లి చేసు కోవాలనుకున్నా మీరు నిరుద్యోగులు. అందు వల్ల ఇద్దరమూ మరిన్ని కష్టాలకు గురి కావడం మినహా ప్రయోజనం వుండదు. అందుకే దయచేసి నన్ను మరిచి పోండి.. అలాగే మరో విషయం... నేను మీకు దక్క లేదన్న మిషతో నాపై ప్రేమను ద్వేషంగా మార్చుకుని నే వ్రాసిన లెటర్ల ద్వారా నన్ను బ్లాక్‌మెయిల్ చేయాలని ప్రయత్నించకండి' అంటూ ఇంకా ఏవో చెబుతూ కంట తడి పెట్టు కున్నావ్!

పెళ్లి ప్రస్తావన వచ్చే సరికి స్వార్థానికి లోబడి నన్నూ అదే కోణం నూంచి ఆలో చిస్తూ అలా అనగలిగి వుంటావు కానీ- ఆ సందర్భంలో నాకు ఉద్యోగ మొచ్చిన విష యాన్ని నీకు చెబితే పరిస్థితి ఎలా వుండేదో కానీ నా నిరుద్యోగాన్ని నీవు అసహ్యించు కుంటున్న వాస్తవం మాత్రం తెలిసేది కాదు? అఫ్‌కోర్స్.. నీ అభిప్రాయాలుకూడా సమంజసమైనవే నేమో?

"ఉద్యోగ మొచ్చిన విషయాన్ని ఆనాడే నీవు నాకు చెప్పి వుంటే మా పెద్దలను ఒప్పించడానికి ప్రయత్నించడమో.. మరొ కటో చేసుండేదాన్ని కదా' అని కదూ నీళ్ల చిప్పిల్లుతున్న నేత్రాలతో ప్రశ్నిస్తున్నావ్.. తొందరపడక చదువు..

"స్నేహితుని నీ దుఃఖ సమయంలోనూ యోధుడిని యుద్ధం లోనూ... గొప్ప వ్యక్తిని అతని వినయం లోనూ భార్యను పేద రికం లోనూ పరీక్షించాలి' అది ఓ సంస్కృత సూక్తి.

బెంగుళూరు నుంచి వస్తూ టైమ్‌పాస్‌కై కొన్న ఓ మేగజైన్స్‌లో ఈ సూక్తి చదవగానే ఓ చిలిపి ఆలోచన కలిగింది నాకు. అది-

భార్యను పేదరికంలో పరీక్షించినా ఆమె లోని అంతర్గత ఆలోచనలు బయట పడవే- కారణం.. సంఘానికి జడిసి కొంతా కట్టు బొట్లకు మరి కొంత మూడుముళ్ల బంధానికి కట్టుబడి మరి కొంతా తనలోని కోరికలను బలవంతానా అదిమిపెట్టి వుంచు తుంది!

కానీ-

ప్రియురాలిని పేదరికంలో పరీక్షిస్తే?

కేవలం ప్రేయసీ ప్రియులిద్దరి మధ్య మూడో వ్యక్తికి తెలియకుండా అయిన దొంగ చాటు పరిచయం పైన మాత్రమే ఆధారపడి ఆలోచించవలసి వస్తుంది! మరి అలాంటి ఒత్తిడు లకు తట్టుకోవడంలోనే కదూ ప్రేమ లోని నిజాయితీ బయట పడేది. అపుడే కదా ఆ ప్రేమకో పరిపూర్ణత్వం సిద్ధించేది!

అందుకే నిన్నుపరీక్షించడానికై ముందుగా అనుకున్న విధంగా ఇంకా నిరుద్యోగ దశలోనే వున్నట్లు చిన్న నాటక మాడాను కానీ-

ఉద్యోగమొచ్చిందన్న ఆనందాన్ని నీవు మారి పోవడం ద్వారా ఆవేదనగా మార్చినా పెళ్లికి ముందే నీ ప్రేమలోని నిజాయితీ బయట పడిందన్న నగ్నసత్యం నీవు దూర మౌతున్నావన్న వ్యథను మరపింప జేస్తోం దంటే నన్ను నమ్ముతావా ప్రియా..?

నేనాడిన నాటకం నీవూహించ లేని మలుపే అయినా నేనాశించిన రెస్పాన్స్ మాత్రం ఇది కాదు లలితా!

ఎలాంటి కష్టాల్లో నయినా చివరికి ప్రపంచ మంతా ఏకమై ముక్త కంఠంతో మన ప్రేమను నిరసించి మనల్ని వేరు చేయడానికి ప్రయ త్నించినా ఏ క్షణంలోనూ ఎలాంటి ఒత్తిడు లకు తలవొంచక చివరి శ్వాస వరకూ నిన్నే అంటి పెట్టుకుని పోరాడుతా కానీ నా మదిలో భవిష్య జీవితపు తోడుగా ప్రతిష్ఠించు కున్న నీ రూపాన్ని దూరం చేసుకోవడానికి ఎంత మాత్రమూ ఒప్పుకోను ప్రియా..'' అని నీవు అనగలిగి వుంటే ఈ ప్రపంచానికి నిన్ను అధిపతిని చేస్తే కలిగే ఆనందానికీ- భగవంతుడు ప్రత్యక్షమై కోరిన వరాన్ని ప్రసా దిస్తానంటే జనించే ఉత్సాహానికి మించి పొంగి పోయుండే వాడిని! అయితే ప్రియా-

నేనాశించినవ స్వార్థపు ఆపేక్ష నాకు లభించక పోయినా ఏ కొంచం యుక్తా యుక్తాలు ఆలోచించడానికీ తావు నీయక నా మనసు నిండా పెరుకు పోయిన ప్రేమ పూరిత పొరలు నీ మాటల తాకిడికి ఒక్క సారిగా కదిలి చితికి పోవడం ద్వారా జీవితం అనుకోని మలుపు తిరగడంతో-

ఆ క్షణం వరకూ 'ప్రేమ' అనే రెండ క్షరాల పదంపై నున్న ఆరాధనా భావం కాస్తా అడుగంటి అర్థం లేనిదిగా అగుపించడంతో ఆవేదన అనంతమై అనుభవం జీవితానికి అనువైన గొప్ప పాఠాన్ని నేర్పింది! తత్ఫలితమే-

ప్రేమంటే విశ్వమంత విశాలమైనది కాదనీ-

ప్రేమలోనూ స్వార్థం దాగి వుంటుందనీ-

అందుకే ఎందరో ప్రేమికులు పెళ్లి విషయం లో పరిస్థితులకు తల ఒంచు తున్నారనీ-

ప్రేమించడం అంటూ నేర్చుకుంటే మరచి పోవడం అనేది కూడా దానితో పాటే అల వడు తుందనీ-

ప్రేమ అంతః స్వరూపాన్ని గురించి చాలా లోతుగానే తెలుసుకోగలిగాన్నేను! అయితే... ఈలక్షణాలేవీ లేకుండా ఇన్నాళ్లూ నా మదిలో నాటుకు పోయిన భావమో..?

'ప్రేమ' కాదు! మరింకేవిటీ అన్నది అప్ర స్తుతం!!

ఈ లేఖద్వారా నీ నుంచి నే ఆశించిందేమి టంటే-

కనీసం ఇకనుంచైనా నీవీ రోజు నుంచి నీ భర్తకు అందించబోయే ప్రేమ తాలూకు విలువను నేనాశించిన స్థాయికి పెంచడం ద్వారా ఆ వ్యక్తికయినా పరిపూర్ణ ఆనందాన్ని అందించానూ అన్న ఆత్మ సంతృప్తి నైనా నీ జీవంతో మిగుల్చుకోమనీ... అంతే!

ఇక కలువనులే... శెలవ్

సంజయ్

పి.ఎ: ఇంకా నిన్ను-సారీ... మిమ్మల్ని 'ప్రియా' అని సంబోధించినందుకు క్షంత వ్యుడిని!

*****

లేఖ చదవడం పూర్తికావించిన 'లలిత' నయనాల నుండి అప్రయత్నంగా అశ్రు ధారలు ఆమె లేత బుగ్గలను తడిగా స్పృశిస్తూ జల జల రాలుతుండగా ఆమె గుండె గొంతు ను నిర్లక్ష్య పరుస్తూ మెదడు చేసే ఆలోచనల ద్వారా మాట్లాడ సాగిందిలా-ఆ లేఖకు సమా ధానంగా-

బహుశా సంజయ్‌కు చేర కూడదనే ఉద్దే శ్యమేనేమో!

"ఇవి విషాదాశ్రువులు కాదు సంజూ... ఆనంద భాష్పాలు. నాన్నగారి మొండి. పట్టు దల తెలియని నీవు నాకొరకై ఎంతకైనా తెగిస్తావని తెలుసు నాకు.. కానీ ఆ తెగింపు మన ప్రేమకు విజయాన్ని కాక వీర మర ణాన్ని మాత్రమే కలిగించగలదని తెలుసు కునీ నీకు చేయూత నెలా ఇచ్చేదీ..? అదీ కాక నీ ఆర్థిక పరిస్థితి ద్వారా నీ తల్లి దండ్రుల తోనూ.. నీ ప్రాణాల ద్వారా నీతోనూ నా 'ప్రేమ'ను అడ్డుగా పెట్టుకుని నా తండ్రి ఆడు కోవడం ఇష్టం లేక పోయింది నాకు! ఎందుకంటే-

లైలా పార్వతుల కాలం నాటి నుంచీ ఈ రోజు వరకు బీదా గొప్పల నడుమ పెన వేసుకు పోవాలనుకునే ప్రేమకు 'క్షితిజ రేఖ' ఒకటి అడ్డుగా నిలుస్తూనే వుంది!

అది గమనించ లేకనే నాన్నగారి అను భవముందు తల ఒంచి ఆయన మొండి తనాన్ని సగం పుణికి పుచ్చుకున్నందున ఆయ నకు కొన్ని షరతులు విధించి పెళ్లి విష యంలో పూర్తిగా లొంగిపోయాన్నేను! ఉత్తర దక్షిణాల్లో ఏది ప్రయోగించారో దూరలోచన లతో దూరంగా వుంటే బెంగుళూరులో ఉద్యోగం వేయించారు నీకు-నాన్నగారు తన మాట నిలుపుకుంటూ! అందుకే నేనూ ఏమీ మాట్లాడ కుండా తను చూపిన అబ్బాయితో తాళి కట్టించుకున్నాను!

నాన్నగారికి పరువుముఖ్యం... నాకు నీ క్షేమం ముఖ్యం.. అంతే!

నేను నీవు రాసినట్టూ 'పెద్దల నెదిరించ డానికా మీరు నిరుద్యోగులు' అన్నపుడు నీకు ద్యోగమొచ్చిన విషయాన్ని ఎందుకు చెప్ప లేదూ అని నాన్నపై అనుమానించాను కూడా... అయితే నీ తెలివితో మన ప్రేమకు పరీక్ష పెట్టినట్లు గ్రహించ లేక ఇన్నాళ్లూ ఎంత సతమతమయ్యానో..? ఆనాడు నా కంట తడికి కారణం నువ్వూహిం చినట్టు నిన్ను కన్విన్స్ చేయడానికై పెట్టు కున్నది కాదు-

నాపై నీలో పెరిగిన ప్రేమను వధించ డానికై నిన్నూ నీ ప్రేమను 'బ్లాక్ మెయిల్' అంటూ చులకన చేసి మాట్లాడుతున్నపుడు గుండెలో శతకోటి అగ్ని పర్వతాలు పగిలిన ఫలితంగా కళ్లనుండి స్రవించిన 'లావా' అది!

మరినాకు ఈ క్షణం ఓ జీవిత సత్యం తెలిసింది.. చెప్పనా..? అదీ-

స్వచ్ఛత-పవిత్రత-నిజాయితీ-

ఈ మూడింటితో కలగలిసిన ప్రేమ ఆత్మనే కోరు తుంది గానీ శరీరాన్ని కాదనీ-

ప్రేమకు పరాకాష్ట 'పెళ్లి' కాదనీనూ!..''

